# రాత్రి-12.

సిమెంట్ రేకులు చిందుతున్న వర్షపు శబ్దం నా గుండె చప్పుడులో లయ బద్ధంగా కలిసిపోతూ, అంతలోనే నిశ్శబ్దంగా విడిపోతూ, నాలోని ఉద్రిక్తతను మెల్లిమెల్లిగా కదిలిస్తూంది.

మూసిన కిటికీ రెక్కల వెలుపల ఆ క్షణాన అనంతమై [illegible]టి వర్తిస్తూందని తెలుసు. అయినా సరే, కొద్దిగా తెరిచి చూశాను.

వర్ష వర్షం కురిసే ప్రతి చీకటి రాత్రి ఎంతో కాలం.. నేను చేస్తున్నదే.

సామాన్యుడి నన్నపాటి మనసునూ, ఆ మనసు తాలూకు అనుభూతుల్ని మత్తు తెరల్లో చుట్టి, నిశ్శబ్దాన్ని బరువుగా కరిగించే ఆ చీకట్లోనే దేన్నో వెతకాలన్న 'ఇన్‌స్టింక్ట్'ను సంవత్సరాల తరబడి ప్రయత్నించీ గెలవలేక పోయాను.

గాలి విసురుకు వర్షం తుంపర మొహం మీద చల్లగా తగిలింది.

వెన్నెముక నిండా చలి...

నా శరీరం నాకు పరిచయమైన 'ఫ్రీజింగ్ స్టేట్‌కు' వచ్చింది.

అంతరంగంలో ఒక కల్లోల తరంగం—అంతకంటే తిరుగుబాటు అంటే బాగుంటుందేమో!

ఆ తర్వాత...?!

ఆ చర్య...!?

తలుపులు తెరిచి.. వర్షంలోకి...

కాళ్ళు ముందుకు లాగుతుంటే ఎప్పటిలా నిస్సహాయుడినై వర్షంలో నిలబడి తడవటం కళ్ళను కాంతి ఖడ్గాలుగా చేసుకుని చీకటిని ఛేదిస్తున్నానన్న ఆనందంతో నాలో నేనే వెర్రిగా నవ్వుకోవడం.

ఆ తిరుగుబాటు తత్త్వమే అటు బంధువర్గంలోనూ, ఇటు మిత్ర బృందంలోనూ పూర్తిగా కాకపోయినా నన్ను ఒక మాదిరి చెడ్డవాడిగా, స్వార్థ పరుడిగా, అవకాశవాదిగా నిలబెట్టింది 'అది కాదు. ఇదీ ఒకమానియా లాంటిద'ని నే నెప్పుడూ ఎవరికీ చెప్పలేదు. చెప్పడానికి సిగ్గుపడి కాదు. చెప్పాల్సిన అవసరం నాకు కనిపించక.

అందువల్ల, నాతో పోల్చి చూసినప్పుడు "లోవరాజు"ను నంబర్ వన్ బుద్ధిమంతుడిగా, శాంతమూర్తి నిగర్విగా అందంతోబాటు నా జీవితంలో మొట్ట మొదటి సారిగా గర్వపడేందుకు కారణమైన విద్యకూడా నిర్ధారించింది.

"అరెరె.. ఇంత వర్షంలో.. చెప్పీ చెప్పీ... లోపలికి రమ్మంటుంటే..!"

నిద్ర కళ్ళతో ఎప్పుడు వచ్చిందో నా భుజం పట్టుకు లాగిన "అరుణ" ఆకృతి వెనక వశం తప్పిన నా భావాలు రూపు దిద్దుతున్న విద్య ప్రతిబింబం మసక మసగ్గా కదిలింది.

విద్య రాసిన ఉత్తరంలోని అక్షరాలు నా కను రెప్పల మధ్య వర్షపు చుక్కల్లా జారుతున్నాయ్. ఆ అక్షరాల నలువులో నన్ను చూసి 'లోవరాజు' వంక. ఎగా హేళనగా నవ్వుతున్నట్టు..

"అరుణా! ఏం చెయ్యమంటావ్..?

టవల్‌తో నా తల తుడుస్తున్నదల్లా, అరుణ ఒక్క క్షణం ఆగింది.

"అంటే...?"

ప్రశ్న చాలా స్వల్పమైనదే.

కాని, దాని వెనకనున్న నిగూఢ భావం అర్థం చేసుకోవడం నాకు సాధ్యం కాదు.

కారణం— విద్యలాగే అరుణ కూడా ఆడది— కాకుంటే ఒకటే తేడా!

విద్య ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పి వూహించని పరాజయాన్ని నేను పొందితే, నా ప్రశ్నలకు నిగూఢంగా సమాధానం చెప్పి, ఎప్పటి కప్పుడు గెలుపు నా కిస్తూ వచ్చింది అరుణ.

"మిమ్మల్ని వెళ్ళద్దని అంటానని ఎలా అనుకోగలిగారు?" సౌమ్యంగా అన్నది మళ్ళీ తనే బీరువాలో నుండి పొడిలుంగీ తీస్తూ.

పెళ్ళికి ముందు విద్యతో తనకున్న పరిచయం, ఆమెను పెళ్ళి చేసుకోవాలనే ప్రగాఢకాంక్ష, అందుకు ప్రత్యర్థిగా నిలిచిన లోవరాజు వూహించని గెలుపూ, అన్నీ వివరంగా చెప్పి—

"ఇప్పుడు చెప్పండి! ఏమంటారు?" అన్న తన ప్రశ్నకు ముందు విచిత్రంగా చూచి, తర్వాత సమాధానంగా ఇలాగే 'అంటే..?' అని అడిగి, మళ్ళీ తనే "నాకు మనస్ఫూర్తిగా అంగీకారమే మిమ్మల్ని చేసుకోవడం!" అన్నది కళ్ళు వాల్చుకుని.

అప్పుడే ఒంటిగంట కావస్తూంది. ఏ పరిస్థితుల్లో ఉండి, విద్య నా ప్రమేయాన్ని అర్థించిందో! ఉదయమే తప్పకుండా వెళ్ళొద్దురుగాని. ఇలా ప్రతి రోజూ ఆలోచనా వలయాల మధ్య చిక్కుకుని, అర్ధ రాత్రి వరకూ, అపరాత్రివరకూ మేల్కొని ఉంటే మీ ఆరోగ్యం ఏమవుతుంది? ప్లీజ్..పడుకోండి" అన్నది గుండె వరకూ రగ్గును కప్పుతూ..

నీలం బెడ్‌లైట్ వెలుగులో అరుణ కళ్ళలో ఏదో ఆర్ద్రత.. ఆ ఆర్ద్రత వెనక యుగాల తరబడి మగవాడికి అర్థంకాని స్త్రీ మనసు.

ఆ ఆర్ద్రత ముందు తన తిరుగుబాటు ధోరణి తల వంచింది. అందుకు తనేనాడూ బాధపడలేదు కూడా.

అదే విద్య ఆధిక్యం పట్ల ఆ తిరుగుబాటు ధోరణి విజృంభించి, లోవరాజులాంటి నిక్కమ్మొడి నయవంచనకు విద్య 'బలి' అయ్యేందుకు కారణమైంది.

సన్నగా, బక్కపల్చగా, అర్భకుడిలా ఉండే లోవరాజు ఆకారం, వాడి వంగి వంగి ప్రవర్తనా నా మెమరీ గ్లాండ్స్ ఆర్గానిజం నిండా నిండిపోయి, నా ఆలోచనలను పిచ్చి పిచ్చిగా మండిస్తూ.. ఐదేళ్ళ నుండీ...

• • •

లోవరాజుతో బాగా పరిచయమున్న వాళ్ళుకూడా నా డో జిత్తుల మారి నక్క అని నాలాంటి వా డెవడైనా బాహాటంగా అన్నా, ఒప్పుకోరు. మానసికంగా వాడిది ఆశ్రయింపు బ్రతుకు.

సమాజం దృష్టిలో మంచివాడుగా, బుద్ధిమంతుడుగా కనపడాలనే వాడి తాపత్రయం వెనక నున్న 'పర్వెర్టెడ్ సైకాలజీ'ని అర్థం చేసుకోడానికి మామూలు మనిషి కెవరికీ సాధ్యపడదు. నలుగుర్లో ఎవరైనా ఒకరు సిగరెట్ కాలుస్తుంటే అది అభ్యంతర కరమే అయినా, సభ్యతను దృష్టిలో పెట్టుకుని ఎవరూ మాట్లాడరు. ఒక వేళ అంతగా మరీ ఇష్టం లేక పోతే, ఆ వ్యక్తి అక్కడి నుండి తప్పుకోవడమో, లేక ఇంకొంచెం నిర్మొహమాటస్థుడైతే క్షమించండి! నాకు సిగరెట్ వాసన ఎలర్జీ—ఆర్పెయ్యం'డనో అంటాడు.

కాని, లోవరాజు మాత్రం అవేవీ చెయ్యడు. ముక్కు పుటాల్ని అసహ్యాన్ని సూచిస్తున్నట్టుగా పెట్టి, మొహం వికారం వ్యక్తమయ్యేలా పెడ్తాడు. ఆ ఫేసియల్ ఎక్స్‌ప్రెషన్స్ ఇతర్లు గమనించాలనీ, తద్వారా చుట్టూ ఉన్నవాళ్ళు తనను బుద్ధిమంతుడిగా బ్రాండైజ్ చెయ్యాలని తాపత్రయ పడ్తాడు.

లోవరాజు పట్ల నాకున్న వేరే పర్సనల్ ప్రెజుడిసీస్ కారణంగా అతని వ్యక్తిత్వాన్ని ఏదో ఒక నారో ఏంగిల్ నుండి నిర్వచిస్తున్నాననుకోవచ్చు ఎవరైనా, కాని, వేరే సందర్భాలలో, లైక్ మైండ్స్‌తో కలిసి ఉన్నప్పుడు సిగరెట్ తాగడం నాలుగైదు సార్లు ప్రత్యక్షంగా చూసినవాణ్ణి నేను.

అలాగే డ్రింక్స్ విషయంలోనూ, సినిమాలు చూడ్డంలోనూ, ఆడపిల్లల విషయంలోనూ—ఒకటేమిటి, ఆఖరుకు పక్కపాడి వేసుకోడంలో కూడా వాడు అద్భుతంగా నటించగలడు. తన చుట్టూ ఉన్న సమాజం దేన్నైతే 'చెడు'గా పరిగణిస్తుందో వాటన్నిటికీ కూడా తను అతీతుడన్నన్న భావం ఎదుటి వాళ్ళలో కలిగించాలన్న తాపత్రయం వాడిది. ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం తప్పు కనక, వాడు తోడబుట్టిన చెల్లెలితో మాట్లాడేటప్పుడు కూడా తల క్రిందికి వంచుకుని, పాదాలమీద చూపు నిలిపి మాట్లాడతాడు తప్ప— సహజత్వం ఏమాత్రం ఉండదు.

పోతే, వాడికి ప్రత్యేకంగా ఇదీ వ్యాపకమంటూ ఉండేదికాదు. వాడి కున్న వ్యాపకమల్లా ఆకర్షణీయంగా కబుర్లు చెప్పడం, అక్షరాల్లో లక్షలు సృష్టించి తనో గొప్ప సమృద్ధుడిగా పోజు కొట్టడం. కొంతకాలం బిజినెస్ అనీ, మరికొంతకాలం లాటరీ అనీ కాలక్షేపం కోసం, సొసైటీలో స్టేటస్ కోసం నామకార్థం చేస్తుండే వాడు. అంతంత మాత్రం సంపాదన కలిగిన అతని తల్లిదండ్రులు అతన్నీ, అతని అబద్ధపు సమర్థతనూ నమ్మి, ఎప్పటి కప్పుడు అడిగినప్పుడల్లా లేదనకుండా అంతో ఇంతో డబ్బు ఇవ్వడం, దానితో ఫ్రెండ్స్‌ని వెంటేసుకుని షికార్లకూ, చిరుతిండ్లకూ, పార్టీలకూ రహస్యంగా ఖర్చుపెట్టి వాళ్ళచేత మన్నించుకో బడటం అతని దిన చర్య.

విద్యను మనసారా ప్రేమించి, ఆమె ప్రేమను పొందగలిగిన తనను విద్య జీవితం నుండి వేరు చెయ్యడమే కాకుండా, నే నుండాల్సిన స్థానాన్ని వాడు ఆక్రమించుకో గలిగాడు. అందుకు బహుశా విద్య మూర్ఖత్వం కూడా కొంతవరకూ కారణం కావచ్చు.

కేవలం ఒక పరీక్షా పత్రంలా ఒక ప్రశ్న వేసి, దానికి నానుండీ, లోవరాజు నుండీ వచ్చిన వేర్వేరు సమాధానాల్లో, బుక్కిష్ నాలెడ్జ్‌తో, అర్థం లేని స్వాతంత్ర్యం పేరుతో లోవరాజు సమాధానానికి ఎక్కువ మార్కు లిచ్చింది.

ఆ రోజు తనకు బాగా గుర్తు.

అప్పటి వరకూ క్యాజువల్‌గా చదివిన విద్యా


సత్యఘోష
-'అర్ధి'
CHANDRA

షన్ సమాజంలో స్త్రీ స్థానాన్ని గురించీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించీ—అలా వేరే సబ్జెక్ట్‌లోకి మారింది.

అంతవరకూ లోవరాజు నటనతో, జుగుప్సాకరమైన వాడి ఫాల్స్ బిహేవియర్‌తో విసుగెత్తి చిరాకేసిన నేను వెంటనే అన్నాను.

"అలాటి వన్నీ నాకు కిట్టవు."

ఆ మాటతో దెబ్బ తిన్నదానిలా చూసింది విద్య, ఒక నిముషం తదేకంగా. నా సమాధానం ఆమెలో అంతటి రెస్పాన్స్ తెస్తుందని నే నూహించలేదు.

మమ్మల్నిద్దర్నీ మార్చి మార్చి చూస్తున్న లోవరాజు టీపాయ్ మీదున్న మాగజైన్ పేజీలు కదిలిస్తూ మెల్లిగా అన్నాడు క్రీగంట విద్యను చూస్తూ:

"మీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేను, మిస్టర్ రావ్! ఈ దేశంలో అనాదినుండీ పురుషుడు స్త్రీని ఎన్ని విధాల అవకాశాలున్నాయో అన్ని విధాలా 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తూనే వచ్చాడు. తండ్రిగా, సోదరుడిగా, భర్తగా వేర్వేరు రూపాల్లో, వేర్వేరు దశల్లో దారుణమైన ఆంక్షలను విధించి, సామాజికంగానూ, ఆర్థికంగానూ, మానసికంగానూ ఒక బానిసగా మార్చాడు స్త్రీని. నాగరికత పెరిగి, విజ్ఞాన శాస్త్ర వికాసం వెల్లి విరుస్తున్న ఈ నవీన

సమోన్నమః

ఫోటో— బి.శంకరయ్య



కాలంలో కూడా ఇంకా ఆ పాత ఫ్యూడల్ భావాలు అందునా మీలాంటివారిలో పాతుకునిపోయి ఉండటం చాలా విచారకరమైన విషయం!"

నాలో ఆవేశం కటలు తెంచుకుంది. అందుక్కారణం వాడి ఆరోపణలోని సత్యదూరత కాదు. నిజానికి అతను విద్య సమక్షంలో ఆ క్షణాన అంటగట్ట చూసినంత ఇరుకు భావాలు కావు నావి. అందుకు నా ఆత్మే ప్రత్యక్ష సాక్షి. కాని, అంతంత పెద్ద పెద్ద నీతి సూత్రాల్నీ, వ్యక్తి ధర్మాల్నీ లోవరాజు లాంటి ఆషాఢభూతి నోటినుండి వినాల్సి వచ్చినందుకే ఆ ఆవేశం నాలో.

"అయితే, మీ భార్య పది మంది లోకి వెళ్ళి, ఉద్యోగం చేస్తానంటే మీకేం అభ్యంతరం ఉండదా?" అన్నది విద్య కళ్ళు విప్పార్చుకుని. లోవరాజు మాటలు ఆమె మీద ఎంతవరకు పని చేశాయో ఆమె మొహం చూస్తేనే అర్థమైంది నాకు.

ఆ ప్రశ్న వింటూనే మెల్లిగా నవ్వాడు లోవరాజు. "భలే వారే. రావ్‌గారి లాగా నాలో ఆ ఛాందస భావాలూ, బూజు పట్టిన సంప్రదాయ చిహ్నాలూ ఏమీ లేవు. అడిగారు కాబట్టి చెబుతున్నాను. నా భార్య ఉద్యోగం చేస్తానంటే తప్పకుండా ఒప్పుకుంటాను సంతోషంగా."

ఆ నిమిషంలోనే నా ప్రమేయం లేకుండా విద్యకూ, నాకూ మధ్య ఒక అగాధాన్ని సృష్టించాడు లోవరాజు.

ఇదంతా నిజంకాదనీ, లోవరాజు గొప్ప నటుడనీ, పెర్వెర్టడ్ ఇగోయిస్టిక్ డెవిల్ అనీ ఆ నిమిషాన విద్య ముందు వాదించే అవకాశం లేకపోలేదు.

కాని, అది కేవలం వాదనగానే నిలిచి పోతుంది తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని నాకు తెలుసు.

పట్టలేని కోపంతో "గో టు హెల్" అని బయటకు నడిచాను.

అంతే...

మరో నెల్రోజుల్లోనే విద్య, లోవరాజుల వెడ్డింగ్ కార్డ్. . .

విద్య నన్ను ప్రేమించీ, పెళ్ళి చేసు కోలేక పోవడానిక్కారణం "నేను భార్యను ఉద్యోగం చెయ్యనివ్వకూడదనుకునే సంకుచిత మనస్కుడ్నట. (అలాగని నాకుగా నేను ఎప్పుడూ స్టేట్‌మెంట్ చెయ్యలేదు. అది లోవరాజు మాటల్లో నుండి విద్య 'డిరైవ్' చేసుకున్న ఎనాలిసిస్.)

లోవరాజు ప్రేమించకుండానే విద్యను పెళ్ళి చేసుకో గలిగింది—వాడు స్త్రీ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించేందుకు కంకణం కట్టుకున్న త్యాగవిరతుడు. (ఇది వాడికిగా వాడు ఆపాదించుకున్న ఫాల్స్ కన్విక్షన్).

విద్య నాకు కాకుండా పోయినందుకు నేను మొదట్లో కొంచెం విచారించినా, ఆ విషయం నా తరవాతి జీవితాన్ని ఏ విధంగానూ 'ఎఫెక్ట్' చెయ్యలేదు. ముఖ్యంగా దేవదాసులాగానో, రోమియో లాగానో, మజ్నూ లాగానో జీవితాన్ని భగ్నం చేసుకునేంత సెంటిమెంటల్ ఫూల్‌ని కాదు నేను. నిజానికి విద్య లోవరాజు మాటల గారడీలో పడి నన్ను వంచించినందుకు నా మనసులో తిరుగుబాటు ధోరణి బయలుదేరింది.

ఆ తిరుగుబాటు మనస్తత్త్వం కారణంగానే అరుణకు విద్యతో తన ప్రేమ వ్యవహారాన్ని గురించీ లోవరాజు వంచన గురించీ పెళ్ళికి ముందే వివరంగా చెప్పాను. పెళ్ళి చేసుకున్నాను. ఒడిదుడుకులు లేకుండా జీవితాన్ని ప్రశాంతంగా గడపగలిగే పరిస్థితుల్ని ఏర్పరుచుకో గలిగాను.

అయితే మొదటినుండీ నా గుండెలో కలుక్కుమంటూ ఉండేది ఒకటే—"లోవరాజు విద్యను ఎక్కడ వంచిస్తాడో" అని.

కాని, రాను రాను విద్య నుండి కానీ, ఇతర మిత్రుల నుండి కానీ అలాంటి సమాచారం ఏదీ అందక పోవడంతో గత అనుభవాలు అనుభవాలుగా కనుమరుగయ్యాయే తప్ప, అనుభూతులుగా నన్ను వెంటాడలేదు. కాని, ఆరోజు ఉదయమే అందిన విద్య ఉత్తరం నాలో అలజడిని రేపింది.

విద్య ఏ సమస్యల సంకెళ్ళతో పోరాడుతూందో— ఉదయమే బయలుదేరి వెళ్ళాలి.

బయట వర్షం చప్పుడు ఇంకా వినిపిస్తూనే ఉంది.

నా కనురెప్పలు మగతగా మూతలు పడ్డాయ్.

* * *

కాలింగ్ బెల్ నొక్కి ఎదురు చూస్తున్నాను.

మెల్లిగా తెరచుకున్న తలుపుల వెనక విద్య. . .

స్తబ్ధుడ్నయ్యాను నేను.

పెద్ద పెద్ద కళ్ళతో, పొడవాటి జడతో, అప్పుడే అర విచ్చిన కమలంలా దరహాసాల్ని చిందించే స్నిగ్ధ సౌందర్య రాశి ఆ నాటి విద్య.

లోతుకుపోయిన కళ్ళ చుట్టూ, అలసట సూచించే ముడతలూ, పాలిపోయిన చెక్కిళ్ళూ, కాంతివిహీనమైన దైన్యమూర్తి ఈ నాటి విద్య.

ఎక్కడో నాలో బాధ సుళ్ళు తిరిగింది.

నన్ను చూస్తూనే ఆమె మొహం ఆనందంతో విప్పారింది. ఆ కళ్ళు ఆప్యాయంగా నన్ను ఆపాదమస్తకమూ చూపులతోనే నిమిరాయి.

"రా, రావ్. ప్రయాణం సుఖంగా జరిగిందా? అరుణ, పిల్లలు బాగున్నారా?"

ఆ మాటల్లో ఎంతో ఆర్ద్రత. . .

"నా సంగతి సరే. ఇదేమిటి, విద్యా...? నువ్వు... ఇలా. . ." విద్యను ఆ స్థితిలో చూస్తుంటే నా కంఠాన్ని ఎవరో నొక్కినట్లు మాటలు రాలేదు.

అంతలోనే అసలు ఆమె ఎందుకు రమ్మన్నదో అన్న విషయం గుర్తు కొచ్చి అదే అడిగాను.

"తరవాత వివరంగా మాట్లాడుకుందాం. ఎప్పుడు భోజనం చేశావో ఏమో. . . ముందు స్నానానికి పద" అంటూ చెయ్యి పుచ్చుకుని లోపలికి నడిపించింది.

భోజనం అయిన తరవాత వాలు కుర్చీలో పడుకున్న నాకు విద్య చెప్పింది వింటూనే షాక్ తగిలినట్లయింది.

"విద్యా, ఏమిటి నువ్వంటున్నది?"

"అవును, రావ్ నేను లోవరాజుకు విడాకు లివ్వాలని నిశ్చయించుకున్నాను. అందుకు సంబంధించిన లీగల్ ఫార్మాలిటీస్‌లో నీ సహాయం కావాలి" అన్నది తలను అరచేతుల మధ్య దాచుకుంటూ.

ఆమె దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నదని చూస్తూనే అర్థమయింది నాకు.

"విద్యా, బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?"

"అవును, రావ్. బాగా ఆలోచించే నిశ్చయించుకున్నాను. నేను పోగొట్టుకునే దంటూ ఒకటి ఉంటే, నా బతుకులో అది ఐదేళ్ళ క్రితమే పోగొట్టుకున్నాను. ఇప్పుడు ఈ విడాకుల మూలంగా అలా పోగొట్టుకునేది ఏదీ లేదు" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

సంవత్సరాల తరబడీ గూడు కట్టుకున్న దిగులు కన్నీటి రూపంలో కట్టలు తెగిందనిపించింది.

ఆమెను ఎలా ఓదార్చాలో అర్థంకాక, మౌనంగా అలాగే కూర్చున్నాను.

ఒక పది నిమిషాల తరవాత తనను తాను సంబాళించుకుంది విద్య.

"ఇంతకూ ఈ నిర్ణయం వెనక నున్న కారణాలు తెలుసుకోవచ్చా, విద్యా?"

నా ప్రశ్నకు తలెత్తి సూటిగా నా కళ్ళలోకి చూసింది విద్య ఒక క్షణం.

"ఆ రోజు నిన్ను కాదని లోవరాజును పెళ్ళి చేసుకోవాలనినేనుతీసుకున్న నిర్ణయం వెనక ఏ కారణం ఉందో అదే కారణం, రావ్. కాకుంటే మరో రూపంలో..."

"అంటే. . .?" విద్య అంటున్న దేమిటో అర్థంకాక అడిగాను.

"ఏం లేదు, రావ్. లోవరాజు తన భార్యకు ఉద్యోగం చేసుకునే స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది ఏదో స్త్రీ జాతి పట్ల విశాల దృక్పథంతో కాదు. కేవలం స్వార్థంతో. తనసోమరితనానికి భార్యను ఒక సోపానంగా వా డుకునేందుకు. ఏం అలా చూస్తావ్? అర్థం కాలేదు కదూ!

ఏ స్త్రీ తన భర్తను దూషించాలని కోరుకోదు. కాని, లోవరాజు లాంటి వాళ్ళ కపట బుద్ధిని కేవలం భర్త అయినంత మాత్రాన కప్పి పుచ్చ ప్రయత్నించి, ఇంకా నన్ను నేను వంచించుకోలేను. తలిదండ్రులు కడుపు కొట్టుకుని, ఇత నేదో ఉద్ధరిస్తాడని ఇచ్చిన ఆస్తిని తగల బెట్టాడు. అతనికి, తన అన్నం తను తినేందుకే బద్ధకం. కాని, అన్నం కావాలి—షడ్రుచులతో. నోటి వరకూ అందించేందుకు మరొకరు కావాలి. రోజంతా ఎక్కడెక్కడో కాలక్షేపం చేస్తాడు స్నేహితులతో. విలాసాలకు తక్కువ లేదు. వ్యాపార మంటూ ఉన్నది కాస్తా నాశనం చేశాడు. పోనీ, ఏదైనా ఉద్యోగం చెయ్యమంటే, ఒకడి మోచేతి కింద బతకడం తనకు చేతకాదంటాడు. నేను తెచ్చే జీతంలో మూడొంతులు అతని పాకెట్ మనీకే సరిపోతుంది. ఆ సంగతే ఎత్తుకుంటే, పోనీ రాత్రి పూట మరో పార్ట్ టైమ్ జాబ్ చూసుకో కూడదా? అన్నాడు. గత్యంతరం లేక ఇప్పుడు అదే చేస్తున్నాను."

ఇంత కాలమూ తనలో తానే కుమిలిపోయిన విద్య ఏకధాటిగా, ఏ అదృశ్య శక్తో మాట్లాడిస్తున్నట్టుగా చెబుతున్న విషయాలు నేను స్తబ్ధంగా వింటూ కూర్చున్నాను.

"ఇదంతా ఒకెత్తు, రావ్. ఎంత శ్రమించడానికయినా నేను బాధ పడను. కాని, ఒక సామాన్య స్త్రీగా నాకూ కొన్ని కోరిక లున్నాయ్. నా భర్త పెద్ద హోదాలో ఉండాలనీ, సమాజంలో పలుకుబడి సంపాదించాలనీ, నన్ను కేవలం డబ్బు సంపాదించే యంత్రంగా కాక, భార్యగా ఆప్యాయంగా చూడాలనీ. . . ఈ వూళ్ళో పరువుల గల వాళ్ళెవరూ అతని నీడపడ్డాని క్కూడా ఇష్టపడరు. నన్ను చూసినప్పుడల్లా, తోటి ఆడవాళ్ళు ఏం గుస గుస లాడుకుంటారో నేను చెవులారా విన్నాను. మానసికంగా నే నెంత నరకం అనుభవిస్తున్నానోఎవరికీ తెలియదు. ఆ అవసరం ఎవరికీ లేదుకూడానేమో. ఇక భరించ గలిగే శక్తీ, ఓపికా—రెండూ లేవు నాకు. అందుకే ఈ నిర్ణయాని కొచ్చాను. . ."

విద్య చెప్పిన దంతా విన్న తరవాత, లోవరాజును ఆ నిమిషానే హత్య చేయాలనిపించింది నాకు. కానీ ఆమె తీసుకున్న నిర్ణయం, ఆ తరవాత మనసు లేని ఈ మనుష్యులూ, మానవత్వం ఇసుమంతకూడా లేని ఈ సమాజమూ ఆమెని చూసే చిన్నచూపు చేసే అవమానాలు ఒక్కసారి కళ్ళ ముందు కదిలాయి.

విద్య నిర్ణయం వెనక నున్న కారణాలు సమంజసమే అయినా, అందుకు పరిష్కార మార్గం మాత్రం ఇది కాదనిపించింది.

"విద్యా, నీ నిర్ణయం మార్చుకునేందుకు ప్రయత్నించమని. . ."

నేను పూర్తిగా మాట్లాడక ముందే కిటికీలో నుండి, ఆకాశం వైపు చూస్తున్నదల్లా ఒక్కసారే చురుక్కున చూసింది నన్ను తీక్షణంగా, కళ్ళు ఎర్రగా, అగ్ని గోళాల్లా ఉన్నాయి. పెదవులు ప్రకంపించాయి ఉద్రేకంతో.

"ఏం? ఎందుకు మార్చుకోవాలి? కేవలం తాత్కాలికావేశంతో, భ్రమతో నిన్ను కాదని లోవరాజును చేసుకునేందుకు నిర్ణయించుకున్నప్పుడు ఆ నాడు ఎందుకు ప్రయత్నించ లేదు రాస్కెల్ నా నిర్ణయం మార్చుకోమని?

కేవలం ప్రేమించిన ఒక ఆడది కాదన్నంత మాత్రాన జీవితాన్ని నాశనం చేసుకునేంత దుర్బలుడ్ని కాదని లోకానికి చాటాలనేగా, నువ్వు కిమ్మనకుండా అరుణను పెళ్ళి చేసుకున్నదీ, సుఖ సంతోషాలు అనుభవిస్తున్నదీ.

అదే ఈ రోజు ఐదేళ్ళూ దిన మొక గండంగా నరకయాతన అనుభవించి, ఆఖరుకు భరించలేక దానుండి బయటపడా లనుకుని తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలా? చెప్పు, రావ్. ఎందు కోసం మార్చుకోవాలి? ఎవరి కోసం మార్చుకోవాలి? నీ కోసమా? లోవరాజు కోసమా? హృదయం లేని ఈ సమాజం కోసమా?


అవధులు దాటిన ఆవేశంతో విద్య మాట్లాడిన ఒక్కో మాటా ఒక్కో శూలంలా నా అంతరంగాన్ని తాకింది.

వర్షంలో తడిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలిసీ, నన్ను వర్షంలోకి నడిపే నా తిరుగుబాటు తత్వం ఎందుకో కళ్ళ ముందు తళుక్కున మెరిసింది మెరుపులా.

విద్య గుండెను పిండే ఆక్రోశంతో అన్న ప్రతి మాటాఆవేదనా తరంగాల్ని మోస్తూనా లోలోపలికి చొచ్చుకుపోయింది.

మెల్లిగా కుర్చీలో నుండి లేస్తూ అన్నాను "పద, విద్యా, లాయరు దగ్గరకు వెళదాం." "

నిశ్శబ్దంగా అనుసరించింది విద్య నన్ను. ★



ధర్మాల రామమూర్తి ప్రదమ వర్ధంతి సందర్భంగా శ్రీ ధర్మాల వెంకటేశ్వరరావును ధర్మాల రామమూర్తిగారి చిత్రాన్ని అందిస్తున్న శ్రీ. ఏ.వి. శ్రీనివాస్